క్లుప్తంగా

ఫిరంగిపురంలో క్రిస్మస్ సందడి



ఫిరంగిపురం: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఫిరంగిపురంలో పండుగ వాతావరణం నెలకొంది. బాల ఏసుదేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఆలయ పరిసరాల చుట్టూ విద్యుత్ దీపాలు, అలంకరణలు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో బొమ్మల అంగళ్లు, మిఠాయిల దుకాణాలు, రంగుల రాట్నాలు ఏర్పాటు చేస్తున్నారు.

క్రీస్తురాకను తెలిపే స్టార్లు

గ్రామంలోని పలు ప్రాంతాల్లో క్రీస్తు రాకను తెలియజేసేవిధంగా రంగురంగుల స్టార్లు ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక మార్నింగ్ స్టార్ కళాశాల, కొత్తపేట రోడ్డు, క్రీస్తునగర్, శాంతిపేట, విజ్ఞాన పురం, అల్లంవారిపాలెం, రాజాపేట ప్రాంతాల్లో విద్యుత్ స్టార్లు ఏర్పాటు చేశారు. విజ్ఞాన పురం సెంటర్, శాంతిపేట, రాజాపేట ప్రాంతాల్లో పెద్దపెద్ద విద్యుత్ తోరణాలు, రంగుల విద్యుత్ పందిళ్లు ఏర్పాటు చేశారు.

చెట్ల కొమ్మలు తొలగింపు

ఫిరంగిపురం: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పండుగ రోజున గ్రామంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే తేరుకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు సీఐ రవీంద్ర బాబు తెలిపారు. తేరుకు తగులకుండా రాజాపేట ప్రాంతంలో రెండుచోట్ల, చర్చి ప్రాంగణంలోనూ, మరికొన్ని చోట్ల చెట్ల కొమ్మలను కూలీలతో నరికించి వేసినట్లు చెప్పారు. పనులను బాల ఏసు దేవాలయ గుడి పెద్దలు జయప్రకాష్ , బాలశౌరి, రామిశెట్టి రాజశేఖర్ పర్యవేక్షించారు.

విద్యుత్ బిల్లుల దహనం



తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని కోరుతూ సోమవారం భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో సుందరయ్య నగర్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు కొట్టే కరుణాకరరావు మాట్లాడుతూ పనులు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలపై విద్యుత్ చార్జీల పెనుభారంగా మారాయని తెలిపారు. వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలతో పాటు, ట్రూ అప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్. భుజంగరావు, శేఖర్, సాయి, వెంకటేష్, సుబ్బయ్య, శివ, గోపి, బాజీ, చిన్నారావు, ప్రభాకర్, శివాజీ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి క్రిస్టియన్ పేటలోని ఓ ఇంటిలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సిబ్బంది తనిఖీ నిర్వహించారు. ఆరుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి వివిధ రంగులతో కూడిన కాయిన్స్‌తో పాటు రూ. 12 వేలను స్వాధీనం చేసుకున్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళ్యాణ్‌రాజు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడికొండ: ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయిన ఘటనలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన తాడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమరావతి మండలం నర్రా యేసుబాబు(46) ఆదివారం ద్విచక్ర వాహనంపై గుంటూరు వెళ్లి తిరిగి వస్తున్నారు. లాం చలపతి కళాశాల వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి పోయింది. ఈ ఘటనలో యేసుబాబు తలకి తీవ్ర గాయమై రెండు చెవుల నుంచి రక్తం వచ్చింది. స్థానికులు వెంటనే గుంటూరులోని ఆసుపత్రికి తరలించారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మరణించడంతో కుటుంబ సభ్యులు తాడికొండ ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

తెనాలిఅర్బన్: విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను డెవలప్ చేసుకోవాలని మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు మారీసుపేటలోని ఎన్‌సీఆర్ ఎస్‌ఎంహెచ్ స్కూల్‌లో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోవ తరగతి తరువాత ఎంచుకునే కోర్సులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ అభిరుచులకు తగినట్లు కోర్సులు ఎంచుకుంటే ప్రయోజనం ఉంటుందని చెప్పారు. కార్యక్రమాన్ని ఏఎల్‌ఎస్‌సీ శ్రీనివాసరావు పరిశీలించారు. నిఖిత, పూజితలు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం పి.వి.సుధారాణి, పలువురు ఉపాధ్యాయులు, రీసోర్స్‌పర్సన్ సిహెచ్‌శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కల్లగా మారిన సొంతిల్లు కల





నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌లు

ఇల్లు కట్టేదెలా?

- భారంగా మారిన నిర్మాణం
- భారీగా పెరిగిన సామగ్రి ధరలు
- హడలిపోతున్న సామాన్యులు
- నిలిచిపోతున్న వ్యక్తిగత నిర్మాణాలు

తాడేపల్లి రూరల్: సామాన్యులకు సొంతింటి కల అందని ద్రాక్షగా మారింది. పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలతో హడలిపోయే పరిస్థితి నెలకొంది. నలుగురు సభ్యులున్న కుటుంబం రెండు పడక గదులు, హాలు, వంట గది ఉన్న ఇంటి నిర్మాణం చేయాలంటే రూ. 30లక్షలకు పైనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఇంటి నిర్మాణం వైపు ఆలోచించాలంటేనే సామాన్యులు వణికిపోతున్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే సాయానికి, అయ్యే ఖర్చుకు పొంతన లేకపోవడంతో ఆలోచించడం వదులుకుంటున్నారు.

తగ్గిన ఇంటి నిర్మాణాలు

ఈ ఏడాది కొత్త ఇంటి నిర్మాణాలు పెద్దగా సాగడం లేదని తాపీ పనివారు చెబుతున్నారు. అందుకు ప్రధాన కారణం ఒక్కటే. సామాన్యులు భరించలేని స్థితికి నిర్మాణ వ్యయం పెరిగింది. ప్రస్తుతం టన్ను ఐరన్ ధర రూ. 66 ఉండగా, ఇసుక 20 టన్నులు రూ. 16 వేలు ఉంది. వెయ్యి ఇటుక ధర రూ. 10,000, సిమెంట్ బస్తా ధర రూ. 280 నుంచి 380 వరకు చేరింది. ఇల్లు నిర్మించడానికి తాపీ పని వారి ఖర్చు రూ. 6 లక్షల వరకు అవుతోంది. ఇవి కాకుండా గుమ్మాలు, కిటికీలు, విద్యుత్ సామాన్లు, ఇతర ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. దీంతో ఇంటి నిర్మాణానికి దిగితే అప్పుల పాలయ్యే పరిస్థితి ఏర్పడింది. దీంతో కష్టపడి కట్టిన ఇంటిని అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇంటి నిర్మాణానికి బ్యాంకులు హౌసింగ్ లోన్‌లు ఇస్తున్నాయి. అయితే, ప్రాసెసింగ్ ఫీజులు రూపంలో 25 వేల రూపాయలకు పైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. భూముల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులు సెంటు భూమి కొనలేని పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో సొంతిల్లు కల కల్లగా మారింది.

కంకర ధర కూడా అదే స్థాయిలో...

నిర్మాణంలో శ్లాబ్ వేయడానికి క్వారీల నుంచి కంకర కొనుగోలు చేస్తారు. ఇటీవల వరకు యూనిట్ రూ. 2,800 నుండి రూ. 3 వేల మధ్య ఉండేది. ఇప్పుడు దీని ధర కూడా పెరుగుతోందని క్వారీ యజమానులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుకలాగే క్వారీలను కూడా కొందరికే కాంట్రాక్టు ఇవ్వడానికి నిర్ణయించింది. ఈ ప్రక్రియ పూర్తయి కొత్త యాజమాన్యాలు వస్తే తప్ప ఇసుకలాగే కంకర రేటు కూడా 30 నుంచి 50 శాతం పెరిగే అవకాశం ఉందని అంటున్నారు.

బడ్జెట్ తలకిందులైంది



మేము అనుకున్న బడ్జెట్ తలకిందులైంది. మెటీరియల్ రేట్లు పెరగడంతో అనుకున్న దానికన్నా ఎక్కువ అవుతోంది. ఒక స్క్వేర్ ఫీట్ నిర్మాణం పూర్తి అయ్యేటప్పటికి 2వేల రూపాయలు ఖర్చు అవుతుందని అనుకుంటున్నాం. గతంలో కన్నా ఇటుకతో పాటు మెటీరియల్ ధరలు పెరిగాయి. కూలీలు కూడా వెయ్యి రూపాయలు లేనిదే ఎవరూ రావడం లేదు. కూలీకి డబ్బులు ఇవ్వలేక నేనే కూలీగా పనిచేస్తున్నాను. సొంత ఇల్లు కట్టుకుంటున్నామన్న ఆశతో అప్పులు చేయాల్సి వస్తోంది.

–అచ్యుత్, పోలకంపాడు

అభ్యుదయవాది చిలకాకు ఘన నివాళి



వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు

తాడేపల్లి రూరల్: అభ్యుదయవాది, మానవతావాది, శ్రామిక వర్గం తరపున నిలిచిన చిలకా వెంకటేశ్వరరావుకు ప్రజా సంఘాల నేతలు, సాహితీ కళావేదిక ప్రముఖులు మంగళగిరి బుద్ధ విహార కార్యాలయంలో సోమవారం ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంగళగిరి బుద్ధ విహార వ్యవస్థాపకులు రేకా కృష్ణార్జునరావు మాట్లాడుతూ బుద్ధ విహార వ్యవస్థాపక బృందంలో ఒకరైన చిలకా వెంకటేశ్వరరావు అకాల మరణం తీరని లోటని అన్నారు. మంగళగిరి సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు మాట్లాడుతూ మానవతా వాది, నిత్య శ్రామికుడు చిలకా వెంకటేశ్వరరావు అని కొనియాడారు. మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు మాట్లాడుతూ మంగళగిరి బుద్ధ విహార, విశ్వశాంతి కళాపరిషత్, మంగళగిరి సాహితీ కళావేదిక.. ఇలా సమాజ హితం కోరి పనిచేసే ఏ కార్యక్రమానికి అయినా చిలకా వెంకటేశ్వరరావు ముందు నిలిచేవారని తెలిపారు. కార్యక్రమంలో విశ్వశాంతి కళా పరిషత్ కన్వీనర్ పొట్లాబత్తుని లక్ష్మణరావు, సామాజిక కార్యకర్తలు రేకా చంద్రశేఖర్, చాపరాల ఇందిర, ప్రజా నాట్యమండలి కళాకారులు కంచర్ల కాశయ్య, అరసం కార్యదర్శి గోలి సీతారామయ్య, కవి సందుపట్ల భూపతి, గాయకులు అల్లక తాతారావు, ఎస్ఎల్ఎం చైతన్య విద్యాలయ వ్యవస్థాపకులు శిందే బాలకృష్ణ, న్యాయవాది శిఖ సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులంతా సన్మార్గంలో పయనించాలి



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న మంగళగిరి పట్టణ యస్ఐ రవీంద్ర నాయక్

తాడేపల్లి రూరల్: విద్యార్థులు నైతిక విలువలు పాటిస్తూ, సన్మార్గంలో పయనించాలని మంగళగిరి పట్టణ యస్ఐ రవీంద్ర నాయక్ సూచించారు. మంగళగిరి టిప్పర్ల బజార్‌లోని నేషనల్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రవీంద్రనాయక్ పాల్గొన్నారు. క్రిస్మ స్‌కేక్ కట్ చేసి వేడకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'నీ వలె నీ తోటివారిని ప్రేమించి ఆదరించాల'ని బైబిల్‌లోని వాక్యాన్ని విద్యార్థులకు తెలియజేశారు. అవకాశం ఉన్న మేరకు పొరుగు వారికి దానం చేయాలని క్రీస్తు బోధించారని వివరించారు. పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం రవీంద్ర నాయక్‌కు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కాకుమాను సౌజన్య ప్రేమ్, పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు ఎదురురెదురుగా వస్తున్న కార్లు ఒకదానికొకటి ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని రేపూడి గ్రామ శివారులో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నుంచి నరసరావుపేటకు వెళుతున్న కారుకు రేపూడి గ్రామ శివారులో ద్విచక్ర వాహనం అడ్డు వచ్చింది.దీంతో డ్రైవర్ అవతలి వైపునకు కారు నడిపాడు. అదేసమయంలో నరసరావుపేట నుంచి వస్తున్న కారును ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డుకు అడ్డుగా కార్లు ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు వాహనాలను పక్కకు పెట్టించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బాధితుల వివరాలు తెలియాల్సి ఉంది.

నుదురుపాడులో రోడ్డు ప్రమాదం

ప్రధాన రహదారి పైకి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నుదురుపాడు రైల్వేస్టేషన్ నుంచి గుంటూరు -కర్నూలు రాష్ట్ర రహదారి పైకి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని గుంటూరు నుంచి నరసరావుపేట వెళుతున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న బాలచంద్ర, శివలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు నరసరావుపేట వైద్యశాలకు చికిత్స కోసం తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

ప్రేమ, శాంతికి నిర్వచనం క్రిస్మస్



వేడుకల్లో మాట్లాడుతున్న ఫాదర్ సహాయరాజ్

తాడేపల్లి రూరల్: ప్రేమ, శాంతికి నిర్వచనం క్రిస్మస్ అని ఆంధ్ర లయోలా కళాశాల కరస్పాండెంట్ రెవ. ఫాదర్ సహాయరాజ్ అన్నారు. సోమవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని గుడ్‌న్యూస్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహాయరాజ్ మాట్లాడుతూ క్రిస్మస్ అంటే ఒకరి పట్ల ఒకరు ప్రేమను, శాంతిని, సహాయాన్ని పంచుకోవడమని తెలిపారు. మన చుట్టూ ఉన్న వారిలో కొందరికైనా ప్రేమను వ్యక్తపరచి సహాయం చేయాలని సూచించారు. అనంతరం సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాంతకుమారి, నాగేశ్వరరావు, బి. రమేష్‌బాబు, సత్యమేరి, కృష్ణారెడ్డి, పి.ఎ. చంద్రశేఖర్, రెవరెండ్‌ఫాదర్ ఆరోఖ్యదాస్, రెవరెండ్ ఫాదర్ సెబాస్టియన విన్‌సెంట్ పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, రాయపాటి శ్రీనివాస్, కళాశాల యాజమాన్యం

తాడికొండ: తాడికొండ సత్యసాయి ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు. కేక్‌ను కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం క్రిస్మస్‌పై విద్యార్థులు ప్రదర్శించిన సంబరాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రేమను సాటి వారికి పంచడమే క్రిస్మస్ సారాంశం అని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సీఈవో అమలు, టీడీపీ నాయకులు తలశిల ప్రసన్న కుమార్, బండ్ల కోటేశ్వరరావు, యెడ్డూరి హనుమంతరావు, జఫ్రుద్దీన్, ఉపాధ్యాయులు ఎన్.వి. రమణయ్య, కార్యదర్శి హరిబాబు పాల్గొన్నారు.

'కిశోరి' వికాసంపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో తోట చందన

మేడికొండూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో తోట చందన ఆధ్వర్యంలో ఆదివారం కిశోరి వికాసంపై మండల స్థాయిలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ ప్రసూన హాజరయ్యారు. ఆరోగ్యం, పోషకాహార అవసరాలు, బహిష్టు పరిశుభ్రత, లింగ అసమానత, బాల కార్మికులు, బాల్య వివాహాలు, జాతీయ అక్షరాస్యత మిషన్ వంటి వివిధ అంశాలపై సమావేశంలో చర్చించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, హేమలత, స్వచ్ఛంద సంస్థ బాలల హక్కుల న్యాయవాద వేదిక సుంచి వెంకట్, ఈటీపీఆర్‌డీ పూర్ణ శంకరరావు, ఏపీఎం విజయభారతి, శిక్షకులు యశోద, శాంతి, సీహెచ్‌ఓ రమణకుమార్ రిసోర్స్ పర్సన్‌లుగా ఉన్నారు. బాల్య వివాహాల నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సంక్షేమ సహాయకులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'తెల్లాకుల'కు ఘన నివాళి



వెంకటేశ్వర గుప్తాకు హరికథా గానంతో నివాళులర్పిస్తున్న శిష్యులు

తెనాలిరూరల్: పట్టణానికి చెందిన హరికథ మరియు బుర్రకథ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యా దానకర్ణ, యక్షగాన కళానిధి, హరికథాచార్య తెల్లాకుల వెంకటేశ్వర గుప్తా భాగవతార్ 113వ జయంతి మహోత్సవాలు, మధుర గాయని మామిడి సరస్వతి భాగవతారిణి సంస్మరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. స్థానిక మారిస్‌పేటలోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి కళ్యాణ మండపంలో ఉదయం నుండి రాత్రి వరకు జరిగిన కార్యక్రమాల్లో వెంకటేశ్వర గుప్త కుటుంబ సభ్యులు, తెలుగు రాష్ట్రాల్లోని ఆయన శిష్యులు పాల్గొన్నారు. గుప్తా, ఆయన కుమార్తె చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రముఖ హరికథకులు బి.లక్ష్మీనారాయణ, మొగలిచర్ల నాగమణి, సిహెచ్.ఆంజనేయరాజు, కె.శారద ఎస్.వేదవతి, విన్నకోట రామకుమారి, ఎం.సింహాచలశాస్త్రి భాగవతుల హరికథాగానంతో ప్రేక్షకులను విశేషంగా అలరించారు. రాత్రికి నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్, తెనాలి పట్టణ కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, అక్కేశ్వరరావు, మురళీకృష్ణ, నన్నపనేని రాంబాబు, విద్యావతి పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు



భౌతిక శాస్త్ర అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు, పరిశోధకులు డాక్టర్ బి.వి. అప్పారావు

తాడేపల్లి రూరల్: కేఎల్ యూనివర్సిటీలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా భౌతిక శాస్త్ర విభాగాధిపతి కె. స్వప్న మాట్లాడుతూ ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా వున్న ప్రముఖ భౌతిక శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారన్నారు. నానో మెటీరియల్స్‌లో తాజా పరిణామాలు, ఇంధన నిల్వ వ్యవస్థల భవిష్యత్తును రూపొందించడంలో వాటి కీలక పాత్రను ప్రదర్శించారని తెలిపారు. కన్వీనర్ ఎస్. షణ్ముగన్ మాట్లాడుతూ అత్యాధునిక పరిశోధనలు, అభివృద్ధి చెందుతున్న పోకడలు, ఇంధన నిల్వలో సాంకేతిక ఆవిష్కరణలపై చర్చలు, నెట్ వర్కింగ్ తదితర విలువైన అంశాలను విద్యార్థులు తెలుసుకునేందుకు ఈ అంతర్జాతీయ సదస్సు వేదికగా నిలిచిందని అన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జి. పార్థసారథివర్మ, ప్రో చాన్సలర్ కె.ఎస్. జగన్నాధరావు, ప్రో వైస్ చాన్సలర్లు ఎ.వి.ఎస్. ప్రసాద్, ఎన్. వెంకటరామ్, కేఎల్ కాలేజ్ ఆఫ్ సైన్సెస్ ప్రిన్సిపాల్ కె. సుబ్రహ్మణ్యం,ఎఫ్ఈడీ ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, ఆర్ అండ్ డీ డీన్ బి.టి.పి. మాధవ్ పాల్గొన్నారు.

సున్నాను కనిపెట్టింది భారతీయులే..



రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గణిత విభాగాధిపతి అప్పారావు

తాడేపల్లి రూరల్: సున్నాను కనిపెట్టి భారతీయులు ప్రపంచ గణిత శాస్త్రానికి అద్భుత కానుక ఇచ్చారని కుఎల్‌యూ గణిత విభాగాధిపతి బి.వి. అప్పారావు అన్నారు. సోమవారం కేఎల్ యూనివర్సిటీలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బి.వి. అప్పారావు మాట్లాడుతూ గణిత శాస్త్రానికి దిశానిర్దేశం చేసిన శాస్త్రవేత్తలు మన దేశంలో చాలామంది ఉన్నారన్నారు. వారిలో ప్రథమంగా ఆర్యభట్ట, మహావీర, బ్రహ్మగుప్త, శ్రీనివాస రామానుజన్ వంటి వారు గణిత శాస్త్రంలో చేసిన పరిశోధనలు అసాధ్యమని తెలిపారు. రామాజున్ మ్యాథ్స్ జీనియస్‌గా చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్లు ఎ.వి.ఎస్. ప్రసాద్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి కె.ఆర్.ఎస్. ప్రసాద్, భగవాన్, గణిత విభాగ ఆచార్యులు పాల్గొన్నారు.

30న తెనాలిలో పోస్టల్ డాక్ అదాలత్

తెనాలిఅర్బన్: ఈ నెల 30వ తేదీన తెనాలి కొత్తపేటలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జి.కరుణాకర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా సేవలకు సంబంధించిన ఫిర్యాదులను అదాలత్‌లో తెలియజేసి పరిష్కారం పొందవచ్చన్నారు. ఉదయం 11 గంటలకు అదాలత్ ప్రారంభం కానున్నట్లు చెప్పారు. వ్యక్తిగతంగా హాజరు కాలేని వారు ఈ నెల 27వ తేదీ లోపు పోస్ట్ ఆఫీస్ సూపరింటెండెంట్, తెనాలి డివిజన్, తెనాలి-522201 అనే చిరునామాకు ఫిర్యాదులను పంపాలని సూచించారు.

శబరిమలకు చేరిన చిర్రావూరు పచ్చళ్లు



పచ్చళ్లు అందజేస్తున్న చిర్రావూరు విజయ పికిల్స్ అధినేత రాము

తాడేపల్లి రూరల్: శబరిమలకు చిర్రావూరు పచ్చళ్లు చేరాయి. మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని విజయ పికిల్స్ యజమాని రాము వివిధ రకాల పచ్చళ్లను అయ్యప్పస్వామి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మురారికి అందజేశారు. మంగళగిరి, చిర్రావూరు శాఖలలో ఆరు టన్నుల వివిధ రకాల పచ్చళ్లను తయారు చేసి శబరిమలలోని అన్నప్రసాదానికి అందించినట్లు ఆయన తెలిపారు. గతంలో తిరుమల తిరుపతి దేవస్థానంతో పాటు రాష్ట్రంలోని పలు దేవస్థానాలకు విజయ పికిల్స్ అందజేశారు. కార్యక్రమంలో విజయ పికిల్స్ సిబ్బందితో పాటు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, విశాఖపట్నం శ్రీ మణికంఠ స్వీట్స్ అండ్ బేకరీ మేనేజింగ్ డైరెక్టర్ నాగరాజు, కర్నూలు శ్రీ దుర్గా స్వీట్స్ అండ్ బేకరీ అధినేత శ్రీనివాసరావు, భీమిలిపట్నం తాతినాయుడు, రవి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాయితీపై సోలార్ ప్యానెల్ ఉచితంగా ఏర్పాటు

తాడికొండ: ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్తను ప్రకటించిందని తాడికొండ, తుళ్లూరు విద్యుత్ ఏఈలు కె. నాగమల్లేశ్వరరావు, చిలక రాజులు ఒక ప్రకటనలో తెలిపారు. పీఎం సోలార్ సూర్యఘర్ ఉచిత పథకం ద్వారా ప్రతి ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు 2 కిలోవాట్లు సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానల్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీతో ఉచితంగా పొందవచ్చని పేర్కొన్నారు. ఇది ఇప్పుడు వారు వాడుతున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి అదనమని తెలిపారు. ఇందుకోసం వారు కరెంటు సర్వీసుకు సంబంధించిన వివరాలను పీఎం సూర్యఘర్ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. మిగిలిన పని మొత్తం ప్రభుత్వమే పూర్తి చేసి సోలార్ ప్యానెల్‌ను ఉచితంగా బిగిస్తుందని తెలిపారు. వెబ్‌సైట్‌లో నమోదు కోసం తమ విద్యుత్ సిబ్బంది సహకరిస్తారని, ఆయా కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు. ఈ సదావకాశాన్ని ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈలు తెలిపారు.

27న విద్యుత్ చార్జీల పెంపుపై 'పోరుబాట'



పోస్టర్‌ను ఆవిష్కరించిన తాడిబోయిన రాధిక. పక్కన పార్టీ నేతలు

తెనాలి: కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక చర్యలను నిరసిస్తూ ఈ నెల 27వ తేదీన విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా కార్యక్రమం 'పోరుబాట'ను జయప్రదం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కల్లం వెంకటప్పారెడ్డి కోరారు. స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో సోమవారం పోరుబాటకు సంబంధించిన పోస్టర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో కల్లం వెంకటప్పారెడ్డి మాట్లాడుతూ, కరెంటు ఛార్జీలను తగ్గిస్తామని, పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆర్నెల్లలోపే కరెంటు ఛార్జీలను పెంచటం ప్రజలను మోసగించటమేనని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ ఎన్నికల్లో అలవికాని హామీలను ఇచ్చిన కూటమి నేతలు తీరా అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ హామీలను పట్టించుకోవటం లేదని గుర్తుచేశారు. నిత్యావసరాల ధరలు రోజురోజుకీ పెరుగుతూ ప్రజలకు భారంగా మారిన తరుణంలో కరెంటు ఛార్జీల పెంపుదల దారుణమని ఖండించారు.

సేంద్రియ వ్యవసాయం రైతులకు లాభం



మున్నంగి(కొల్లిపర): నేటి సమాజంలో సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో రైతులు పంటలు పండించటం వలన ఆరోగ్యంతో పాటు అధిక లాభాలు ఆర్జించవచ్చని డి.హెచ్‌ఏటీ సుగంధ ద్రవ్యాల కొనుగోలు సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ సునీత అన్నారు. రైతుల దినోత్సవం సందర్భంగా డి.హెచ్‌ఏఏటీ సుగంధ ద్రవ్యాల కొనుగోలు సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని మున్నంగి గ్రామంలో పసుపు, మిరప రైతులకు సేంద్రియ వ్యవసాయం, పండిన పంటలు ఏవిధంగా మార్కెట్‌లో అమ్ముకోవాలి అన్న అంశాలపై అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. లిట్‌విన్ ట్రేడ్స్ కంపెనీ వంగా గౌతమ్‌రెడ్డి రైతులకు పలు సూచనలు అందజేసి, కిట్లులను అందించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌ఏఏటీ సుగంధ ద్రవ్యాల కొనుగోలు సంస్థ సభ్యులు రవిశంకర్, వెంకటరమణ, సురేష్ కృష్ణా, రైతులు ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఆరిగ దిలీప్‌రెడ్డి, కోడూరు శ్రీను, రైతులు పాల్గొన్నారు.